RNI NO: TGTEL/26/A0383

డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక
శనివారం 21-02-2026
తెలంగాణ జిల్లాలు

## ఎక్సైజ్ అధికారులకు ఆయుధాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు. ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు.



2

# స్మార్ట్‌కార్డుల పేరిట రూ75 కోట్లు వృథా!

- ఒక్కో 'ఫ్రీ బస్' కార్డు తయారీకి రూ.1,500.
- ఖర్చు తగ్గిస్తున్నామంటూనే సర్కార్ తిరోగమన చర్య.
- కాంగ్రెస్ నిర్ణయంపై ఆర్థిక నిపుణుల మండిపాటు.



జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 20

ఒక వైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూనే కాంగ్రెస్ సర్కార్ దుబారా ఖర్చుకు వెనుకాడటం లేదు. అందాల పోటీలు, మెస్సీతో మ్యాచ్ కోసం కోట్లు ఖర్చు చేసి ప్రజల్లో అభాసుపాలైన విషయం తెలిసిందే. ఇక తాజాగా మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణంలో భాగంగా చిప్‌తో కూడిన స్మార్ట్‌కార్డుల తయారీకి రూ. 75కోట్లు ఖర్చు చేయనున్నట్టు సమాచారం. జూన్ 2 నుంచి ఈ కార్డులను ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఆర్టీసీ ఇప్పటికే ఈ మొత్తం ఆర్థిక సాయం రూపంలో ఇవ్వాలని ప్రభుత్వానికి మిగతా 2 లో ...

## కాంగ్రెస్ గెలిచిన పాపానికి రైతులకు శాపం

- మాజీ మంత్రి హరీష్ రావు



2

## గుట్టలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు.

### మత్స్యావతారంలో దర్శనమిచ్చిన స్వామివారు.



జనం వాయిస్, యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి 20

మహిమాన్విత యాదగిరిగుట్టపై పంచ నారసింహుడిగా కొలువైన దేవ దేవుడి మత్స్యావతార అలంకార వైభవం భక్త జనులను అలరించింది. స్వామి వారి ప్రధానాలయం లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం నిత్యపూజ కైంకర్యాల అనంతరం మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని అభిషేకించి మత్స్యావతారుడిగా అలంకరించి ఆస్థానం చేశారు. నాలుగు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, దివ్యప్రబంధ ప్రాశుర పఠనాలను కనుల పండువగా చేపట్టారు. దుష్ట శిక్షణ..శిష్ట రక్షణ కోసం మహా విష్ణువు అవతార రూపాల్లో స్వామివారిని ఉత్సవాల్లో అలంకరించి సేవించడం ప్రత్యేకత అంటూ ప్రధానార్చకులు మత్స్యావతార విశిష్టతను వివరించారు. పట్టు వస్త్రాలు, బంగారు, వజ్రా భరణాలు, వివిధ రకాల పుష్పాలతో దివ్య మంగళకరంగా అలంకరించిన స్వామి వారిని కొలుస్తూ మంత్రోచ్ఛరణలు, మూలమంత్ర జప స్తోత్రాలు సాగుతుండగా గోవిందనామ స్మరణ మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త బీ. నరసింహ మూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కందూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ నాయకుడి

# దారుణ హత్య

4 లో...

## అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

జనం వాయిస్, ఖైరతాబాద్:

ట్యాంక్ బండ్ పై ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్ వ్యూ పార్క్ లో మహాత్మా జ్యోతిరావు పూలే గారి విగ్రహ ఏర్పాటు పనులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరిశీంచారు. కవిత మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. బీసీ బిల్లుల ఆమోదం కోసం ప్రధాని మోడీపై సీఎం రేవంత్ రెడ్డి ఒత్తిడి పెంచాలి. విద్యార్థుల పరీక్షలను కూడా పట్టించుకోకుండా వరుస ఎన్నికలు పెడుతున్నారు. బడ్జెట్ లో బీసీలకు రూ. 20 వేల కోట్లు పెట్టి ఖర్చు చేయాలని అన్నారు. ప్రతిపక్షాలుగా బీజేపీ, బీఆర్ఎస్ విఫలం.. అందుకే ప్రజలకు ఇష్టం లేకున్నా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటేశారు. పూలే విగ్రహం ట్యాంక్ బండ్ పై మాత్రమే కాదు.. అసెంబ్లీలోనూ పెట్టాలి. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలి.. ఖర్చు జాగృతి నుంచి భరిస్తామని అన్నారు. ట్యాంక్ బండ్ మీద విగ్రహం ఏర్పాటు చేయటం పాక్షిక విజయమే. పూలే విగ్రహం అసెంబ్లీలో కూడా ఉండాలన్నది మా డిమాండ్. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనిచేయకపోతే జాగృతి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తప్పకుండా పూలే గారి విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేస్తాం. ట్యాంక్ బండ్ పై విగ్రహ ఏర్పాటు కోసం పనులు చేస్తున్నా ఒక్క పూలే గారి విగ్రహం మాత్రమే పెడుతారా.. సాయిత్రి భాయి తో కలిపి విగ్రహం ఏర్పాటు చేస్తారా అనే దానిపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వడం లేదని అన్నారు.

# ఎక్సైజ్ అధికారులకు ఆయుధాలు

**జనం వాయిస్, హైదరాబాద్ ఫిబ్రవరి 20:**




స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తామని వెల్ల డించారు. తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి శు క్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ జి. అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలిచిన పాపానికి రైతులకు శాపం

**జనం వాయిస్ హైదరాబాద్ ఫిబ్రవరి 20:**



గోదావరిలో కావాల్సినంత నీళ్ల ప్రవాహం ఉందని బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. సమ్మక్క బ్యారేజ్ దగ్గర 16 వేల క్యూసెక్కుల నీళ్లు పోతున్నాయని, నదిలో నీళ్లు ఉన్నాయని..రైతాంగానికి నీళ్లు అవసరముందని అన్నారు. హన్మకొండ జిల్లాలోని దేవన్నపేటలో దేవాదుల పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొని బిఆర్ఎస్ పనులు పూర్తి చేసిందని, దేవాదుల ప్రాజెక్టును అద్భుతంగా తీర్చిదిద్దింది మాజీ సిఎం కెసిఆర్ అని కొనియాడారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అంగుళం కూడా ముందుకెళ్లడం లేదని, దేవన్న పేట పంప్ హౌస్ లో 3 మోటార్లు ఆఫ్ చేసి పెట్టారని హరీష్ రావు విమర్శించారు. 155 మీటర్ల లోతైన పంప్ హౌస్ ఇది అని.. ఉన్న మోటార్లు సరిగా నడపడం చేతకావడం లేదని, ఆనాడు దేవాదులకు అన్యాయం చేసింది కాంగ్రెస్సే అని మండిపడ్డారు. ఆనాడు దేవాదులకు 25 టిఎంసిలు మాత్రమే నీటి కేటాయింపులు అని.. మోటార్లు ఆన్ చేసి చేయకుండానే గాలిమోటార్ ఎక్కి హైదరాబాద్ చేరారని ఎద్దేవా చేశారు. 2025 మార్చి 18న జిల్లా మంత్రులు వచ్చి హడావుడి చేశారని, గత ఏడాది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 60 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ధ్వజమెత్తారు.

# స్మార్ట్‌కార్డుల పేరిట రూ75 కోట్లు వృథా!




మొదటి పేజీ తరువాయి ...

విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అయితే తొలుత జిల్లాకో మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ ప్రతిపాదనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం రాష్ట్రంలో 5 లక్షల మందికి రూ.75 కోట్లు ఖర్చు అయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 2కోట్ల మహిళలకు కార్డులు ఇవ్వాలంటే ఎంత ఖర్చు కావాలనే చర్చ మొదలైంది. ఒక్కో కార్డుకు రూ. 1,500 ఖర్చు అవుతుందా? అనే ప్రశ్న ఉత్పన్నం అవుతున్నది. కమీషన్ల కోసమే కొత్త నాటకానికి సర్కార్ తెరతీసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..

# సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ నాయకుడి దారుణ హాత్య

**జనం వాయిస్, సిద్దిపేట ఫిబ్రవరి 20:**



సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ నాయకుడి దారుణ హత్యకు గురయ్యాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బాల్‌రెడ్డి (50) పని ముగించుకుని బైకుపై తెల్లాపూర్‌లోని తన నివాసానికి వెళ్తుండగా గ్రామ శివారులో కొందరు గుర్తు తెలియని దుండగులు ఆయనను అడ్డగించి కత్తులతో అత్యంత కిరాతకంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాల్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. పోస్ట్ మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో దుబ్బాక ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.